# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నైపుణ్యాలతో కూడిన విద్యను అందించడంలో కాకినాడ జేఎన్టీయూ కీలక పాత్ర పోషిస్తోందన్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్.**

2. **కేంద్ర ప్రభుత్వ సహకారంతో పార్లమెంట్‌లో అమరావతి బిల్లు ఆమోదం పొందనుందని పేర్కొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

3. **వంట గ్యాస్ సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్న మంత్రి నాదెండ్ల మనోహర్.**

4. **స్వర్ణాంధ్ర -2047 లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

=========================

నైపుణ్యాలతో కూడిన విద్యను అందించడంలో కాకినాడలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం జేఎన్టీయూ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడ జేఎన్టీయూ 12వ స్నాతకోత్సవంలో గవర్నర్ ఈ రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ ప్రసంగిస్తూ,

వాయిస్ …30… సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వ సహకారంతో పార్లమెంట్‌లో అమరావతి బిల్లు ఆమోదం పొందనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎన్డీఏ నాయకులతో ముఖ్యమంత్రి ఈరోజు శ్రవణ మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభలో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందనుందని అన్నారు. అమరావతిపై శాసనసభలో తీర్మానం చేసి పంపిన తక్కువ సమయంలోనే బిల్లును పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. రాజ్యసభలో ఆమోదం పొందిన తర్వాత పార్లమెంట్‌లో ఆమోద ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. బిల్లు ఆమోదం అయినందుకు ఈ రోజు సాయంత్రం అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు జరపాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

కాగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఈ మధ్యాహ్నం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ జరుగుతోంది.

---------------------------

అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభలో ఆమోదం పొందటంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని నారా లోకేష్ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రప్రభుత్వం గొప్ప సహకారం అందించిందని తెలిపారు. అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతుల సహకారాన్ని ప్రధానమంత్రికి వివరించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడంలో నిరంతర మార్గదర్శకత్వం చేయాలని కోరారు.

---------------------------

బస్సుల దృఢత్వాన్ని నిర్ధారించడానికి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రామాపురంలోని ఆర్అండ్బీ అతిథి గృహం నుంచి.. రవాణాశాఖ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత పర్యాటక బస్సుల యజమానుల సంఘం సభ్యులతో దృశ్య మాధ్యమ విధానంలో మంత్రి నిన్న సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న బస్సులను ఆంధ్రప్రదేశ్కు బదిలీ చేసుకునేలా సంబంధిత యజమానులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. త్రైమాసిక పన్నును ఒక్కో సీటుకు 4 వేల నుంచి 2 వేల 5 వందల రూపాయలకు తగ్గిస్తామన్నారు. ఫలితంగా బస్సుల నిర్వాహకులు, ప్రయాణికులు లబ్ధి పొందుతారని చెప్పారు. బస్సుల్లో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రమాదాలు నియంత్రించవచ్చని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తూ, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో 7 నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి మంత్రి నిన్న శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి 4.5 నుండి 5 కోట్ల రూపాయల వ్యయంతో నూతన విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 6 వేల సౌర ఫలకాలను మంజూరు చేసామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

వంట గ్యాస్ సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. రోజువారీ సిలిండర్ల సరఫరాపై ప్రజల్లో భయాందోళనలు నివారించేందుకు ప్రతి రోజు సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రంలో వంట గ్యాస్ కొరత లేదని సరఫరా స్థిరంగా ఉందని తెలిపారు. నిన్న రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 43 వేల 745 గృహావసర సిలిండర్లు బుకింగ్ అయ్యాయని, మొత్తం 3 లక్షల 6 వేల

758 సిలిండర్లు ఇళ్లకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు. బుకింగ్‌ల కంటే డెలివరీలు ఎక్కువగా ఉన్నాయని ఇది మెరుగైన గ్యాస్ లభ్యత సూచిస్తుందని తెలిపారు.

---------------------------

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యానికి 15 శాతం వృద్ధి సాధించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమం"లో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి జిఎస్‌డిపిలో 11.89 శాతం వృద్ధి సాధించామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో వైద్య సేవలను బలోపేతం చేసేలా 482 మంది వైద్యులకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజారోగ్య శాఖ ద్వారా శాశ్వత ప్రాతిపదికన ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని సూచించారు. గత సంవత్సరం జారీ చేసిన నోటిఫికేషన్‌కు స్పందనగా సుమారు 5 వేల దరఖాస్తులు వచ్చాయని 611 ఖాళీలకు గాను 482 మంది అభ్యర్థులకు ఆన్ లైన్ ద్వారా పారదర్శకంగా నియామక ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. జిల్లాల వారీగా వైయస్సార్ కడప జిల్లాలో అత్యధికంగా 52 ఉద్యోగాలు భర్తీ కాగా, అనంతపురం, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయని తెలిపారు.

---------------------------

పిల్లల్లో మంద బుద్ధి నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ ఆటిజం అవగాహనా దినం నిర్వహిస్తున్నారు. 2007వ సంవత్సరం డిసెంబర్ 18వ తేదీన ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు 2008వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 2వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. కొందరు పిల్లలు చురుకుగా వ్యవహరించకుండా.. ఎవరితోనూ కలవకుండా.. ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, సరిగా మాట్లాడలేకపోవడం వంటి లక్షణాలు కలిగి ఉండడాన్ని మందబుద్ధి.. ఆటిజంగా పిలుస్తారు. తల్లి దగ్గరకు తీసుకుంటున్నప్పటికీ.. పెద్దగా స్పందించకపోవడం ఆటిజం మరొక లక్షణం. ఇటువంటి లక్షణాలు కలిగి ఉన్న పిల్లల మానసిక స్థితిని ముందుగానే పసిగట్టి వైద్యుల సలహా మేరకు చక్కని మానసిక శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది.

---------------------------

పుట్టుకతో వినికిడి లోపంతో ఉన్న పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వినికిడి పరికరాలు పంపిణీ చేస్తుందని అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి.దేవి అన్నారు. ప్రపంచ వినికిడి అవగాహన దినోత్సవంను పురస్కరించుకుని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ఈ రోజు పాల్గొన్నారు.

=====================